

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విజయనగరం టౌన్, జూలై 25: విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల- బోధనాసుపత్రి పరిధిలో 26 జూనియర్ అసిస్టెంట్/కంప్యూటర్ అసిస్టెంట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులను కాంట్రాక్టు/ఔట్ సోర్సింగు విధానంలో భర్తీ చేస్తామన్నారు. గతంలో జారీ చేసిన 1/23 నోటిఫికేషన్ రద్దు చేసి, దాని స్థానంలో అదనపు పోస్టులు జోడించి నోటిఫికేషన్ ఇస్తున్నట్టు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి తాజా నోటిఫికేషన్ కింద దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



- మళ్లీ గోకులాల నిర్మాణానికి ప్రభుత్వ శ్రీకారం
- పశువుల షెడ్లకు 90 శాతం రాయితీ
- గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 30 శాతం..
- ఆనందం వ్యక్తం చేస్తున్న పెంపకందారులు

పాడి రైతులకు మంచి రోజులు

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి/కొమరాడ)

వ్యవసాయ, పాడి రైతులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వీరికి తోడ్పాటు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో అమలు చేసిన పథకాలను మళ్లీ అమలు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగానే ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీపై పశువులు, జీవాల షెడ్ల(గోకులాలు)ను మంజూరు చేసేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలో 15 లక్షలకు పైగా పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు ఉన్నట్లు గణంకాలు చెబుతున్నాయి. ఇందులో ఆవులు 2,88,681, గేదెలు 46,017, గొర్రెలు 2,07,451, మేకలు 1,73,110, కోళ్లు 8,46,060 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తరువాత ఎక్కువమంది పాడి సంపద పైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అలాగే, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంపై కూడా అనేక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ముఖ్యంగా ఎండ, వర్షాల సమయంలో చాలా చోట్ల మూగజీవాలు బయటే ఉండిపోతాయి. వాతావరణ మార్పులతో తగిన రక్షణ లేక వ్యాధుల బారినపడి మృతి చెందుతుంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాడి పశువులకు నీడ కల్పించేందుకు గోకులం పథకం పేరిట షెడ్లను రాయితీపై నిర్మించుకునే వెసులబాటును కల్పించింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పథకానికి మంగళం పాడింది. పాడి రైతులకు కష్టాలు తప్పడం లేదు. మళ్లీ ఆ పథకాన్ని కొనసాగించేలా తాజాగా కూటమి సర్కార్ ఆదేశాలు ఇచ్చింది. కేవలం పాడి పశువులకే కాకుండా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు బాసటగా నిలిచేలా ప్రణాళికలు రూపొందించింది. ఆయా జీవాల పెంపకానికి అవసరమైన షెడ్ల నిర్మించుకొనేందుకు భారీగా రాయితీ ఇవ్వనున్నారు. పాడి రైతులకు 90 శాతం, కోళ్ల, మేకలు, గొర్రెల పెంపకందారులకు 70 శాతం రాయితీ ఇవ్వనుంది. మిగతాది లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా నిధుల చెల్లింపుతో పాటు పనులు జరగనున్నాయి. ఈ మేరకు సొంత భూమి, ఇంటి స్థలం ఉండే వారికి ప్రాధాన్యత ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ, సంచార జాతులు, నోటిఫైడ్ గిరిజన మహిళలకు బృందాలుగా అవకాశాలు కల్పిస్తారు. లబ్ధిదారులు సన్న, చిన్నకారు రైతులై ఉండాలి. ఉపాధి హామీ జాబ్ కార్డు తప్పనిసరి.

నిధుల మంజూరు ఇలా..

రెండు పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.1.15లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షల ఖరీదుతో యూనిట్లు ఇవ్వనున్నారు. ఇందులో రైతు వాటాగా 10 శాతం కట్టవలసి ఉంటుంది. మిగిలినది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పూర్తి రాయితీతో మంజూరు చేయనున్నారు. అలాగే 20 గొర్రెలు, మేకలు షెడ్డుకు రూ.1.3 లక్షలు, 50 గొర్రెలు, మేకలు షెడ్డుకు రూ.2.3 లక్షలు, 100 కోళ్ల షెడ్డుకు రూ.87 వేలు, 200 కోళ్లకు రూ.1.32 లక్షలు అందిస్తారు. ఇందులో 70 శాతం రాయితీ కాగా, మిగిలిన 30 శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించవలసి ఉంటుంది.



గోకులం షెడ్(ఫైల్)

ఆనందంగా ఉంది

పశువుల కోసం షెడ్లు నిర్మించుకోవడానికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించడం ఆనందంగా ఉంది. షెడ్ నిర్మాణానికి 90 శాతం ఇవ్వడంతో వాటిని నిర్మించుకొనేందుకు అవకాశం ఉంటుంది.

-మాధవరావు, పాడి రైతు, పార్వతీపురం

ఎంతో ఉపయోగం

నాకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఆర్థిక భారంతో జీవాల కోసం సరైన షెడ్ నిర్మించుకోలేకపోయా. షెడ్ల నిర్మాణానికి 30 శాతం లబ్ధిదారుల వాటాగా చెల్లిస్తే మిగిలిన 70 శాతం ప్రభుత్వం చెల్లిస్తామనడం సంతోషంగా ఉంది. ఈ పథకం గొర్రెల పెంపకందారులకు ఎంతో ఉపయోగపడనుంది.

-అప్పలనాయుడు, గొర్రెల పెంపకందారుడు, పార్వతీపురం

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాన్ని పాడి రైతులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతం వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

-రామచంద్రరావు, డ్వామా, పీడీ, పార్వతీపురం

త్వరలో లబ్ధిదారుల గుర్తింపు

గో కులాల కోసం ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించింది. ఈసారి పశువులకే కాకుండా మేకలు, గొర్రెలు, పెరటి కోళ్ల కోసం షెడ్లు వేసుకునే అవకాశం ఉంది. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ త్వరలో జరుగుతుంది. పనులు మాత్రం ఉపాధిఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతాయి.

-డాక్టర్ శ్రీనివాసరావు, పశు సంవర్థకశాఖ, ఏడీ

20 నెలలుగా జరగట్లే!

- పిల్లర్లు వేసి వదిలేశారు
- నిలిచిన సీతానగరం వంతెన పనులు
- బిల్లులు చెల్లించడంలో గత సర్కారు నిర్లక్ష్యం
- నిర్మాణాన్ని ఆపేసిన కాంట్రాక్టరు

(సీతానగరం)

సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై నిర్మిస్తున్న వంతెనకు మోక్షం లభించడం లేదు. గత 20 నెలలుగా పనులు సాగడం లేదు. కేవలం పిల్లర్లు వేసి వదిలేశారు. కాంట్రాక్టర్‌కు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేపట్టడం లేదు. దీంతో దీని నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. 36వ రాష్ట్రీయ రహదారి మార్గంలో సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై ఉన్న పాత వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కొత్త వంతెన నిర్మాణానికి గాను గత ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసింది. 2020 జూలైలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. పిల్లర్ల పనులు , వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డును పూర్తి చేశారు. అయితే శ్లాబ్ పనులు ప్రారంభించే సరికి.. గత వైసీపీ ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లించలేదు. దీంతో దాని నిర్మాణానికి బ్రేక్ పడింది. సుమారు 20 నెలలుగా పనుల ఊసేలేదు. దీంతో శిథిలావస్థలో ఉన్న పాత వంతెనపై భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఒడిశా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రోజూ 2,500 వాహనాలు పైబడి ప్రయాణిస్తుంటాయి. దీంతో పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పాత వంతెనపై 20 టన్నులకు పైబడి మించి బరువు ఉన్న వాహనాలు రాకపోకలు నిషేధించారు. అయినా 60 టన్నుల పైబడి బరువుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం స్పందించి.. వంతెన పనులు పూర్తి చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై వంతెన పనులకు సంబంధించి సుమారు రూ.50 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో మళ్లీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ఆలోచిస్తున్నాడు. వీలైనంత వరకు త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

-ఏ.అప్పాజీ, డీఈ, ఆర్అండ్‌బీ



నిలిచిపోయిన వంతెన పనులు

వారు రాకుంటే చంపేసేవి

- కుక్కల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

జియ్యమ్మవలస, జూలై 25: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురం గ్రామానికి చెందిన కర్రి పోలమ్మ అనే మహిళ కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. గురువారం గ్రామ సమీపంలో పొలం పనులు చేస్తుండగా ఆమెపై కుక్కలు దాడి చేశాయి. దీంతో కాళ్లు, తల వెనుక భాగంలో, చెవులపై తీవ్ర గాయాలయ్యాయి. పక్క పొలాల్లో పనిచేస్తున్న వారు పరుగున వచ్చి కుక్కలను తరిమేశారు. లేదంటే పోలమ్మను చంపేసేవి అని బంధువులు చెబుతున్నారు. పోలమ్మను చినమేరంగి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యాధికారి సునీల్‌కుమార్, డాక్టర్ చైతన్య ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించారు. కుక్కల బెడదను పూర్తిగా నిర్మూలించాలని గ్రామస్థులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పోలమ్మ

గర్భిణుల అవస్థలు

- చినమేరంగి సీహెచ్‌సీలో కానరాని గైనకాలజిస్టు
- వైద్యం కోసం పార్వతీపురం వెళ్తున్న వైనం

(జియ్యమ్మవలస)

చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు లేకపోవడంతో గర్భిణులు అవస్థలు పడుతున్నారు. వైద్యం కోసం జిల్లా కేంద్రం పార్వతీపురం వెళ్తున్నారు. మండలంలోని జియ్యమ్మవలస, రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 102 గ్రామాలు ఉన్నాయి. ఇందులో 40 వరకు గిరిజన గ్రామాలే ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఉన్న గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షల కోసం చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. బాలింతలు కూడా ఏ కష్టం వచ్చినా ఇక్కడికే వస్తారు. రోజుకు 20 నుంచి 30 మంది గర్భిణులు ఇక్కడే వైద్య సేవలు పొందేవారు. అయితే, ఇక్కడ డిప్యుటేషన్‌పై గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ అన్నాజీరావును ఈ నెల 14న ఉన్నతాధికారులు రిలీవ్ చేశారు. ఈయన్ను మళ్లీ సాలూరు ఏరియా ఆసుపత్రికి పంపించేశారు. ఆ స్థానంలో ఎవరినీ ఇక్కడ నియమించకపోవడంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నాజీరావును ఇక్కడి నుంచి రిలీవ్ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాలూరు ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ బి.స్రవంతి, డాక్టర్ మీనాక్షి అనే ఇద్దరు గైనకాలజిస్టులు ఉన్నారు. అక్కడ రోజుకు 20 నుంచి 25 మంది వరకు మాత్రమే ఓపీ ఉంటోంది. మరి అన్నాజీరావును ఎందుకు అక్కడికి పంపించాల్సి వచ్చిందో వైద్య విధాన పరిషత్ అధికారులకే తెలియాలి.



వైద్య పరీక్షల కోసం సీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులు



గైనకాలజిస్టు లేక ఖాళీగా ఉన్న గది

విద్యుత్ బిల్లులు చెల్లించేదెలా?

- గిరిజన గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య
- సిగ్నల్స్ అందక పని చేయని ఫోన్లు
- ఈపీడీసీఎల్ యాప్‌తో ఇబ్బందులు

(సీతంపేట)

కరెంట్ బిల్లుల చెల్లింపు కోసం తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) తీసుకొచ్చిన కొత్త యాప్‌తో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గిరి శిఖర గ్రామాల్లో ఫోన్లకు సరిగా సిగ్నల్స్ అందక ఆ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని ఆర్‌బీఐ మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో థర్డ్ పార్టీ యాప్‌లతో సంబంధం లేకుండా వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు గాను ఈపీడీసీఎల్ ఇప్పటికే ఈస్ట్రన్ పవర్ పేరిట ఓ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను ఉపయోగించి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించాలని స్పష్టం చేసింది. ఆ దిశగా ప్రజలకు, వినియోగదారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, సీతంపేట మండలంలో అనేక గిరిజన గ్రామాలకు నెట్‌వర్క్ సౌకర్యం లేదు. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికే పలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే, విద్యుత్‌శాఖ కొత్తగా రూపొందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే ఆండ్రాయిడ్ ఫోన్లు తప్పనిసరిగా ఉండాలి. ఈ ఫోన్లు గిరిజనుల వద్ద లేవు. రూ.20 వేల వరకు ఖర్చు చేసి వాటిని కొనుగోలు చేసుకోలేని పరిస్థితి గిరిజనులది. గిరిజన ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కులాలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయినప్పటికీ చాలా వరకు విద్యుత్ బిల్లులు వస్తుండడంతో వాటిని చెల్లించడానికి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారానికి ఒకసారి వచ్చి దోనుబాయి, సీతంపేట విద్యుత్ సబ్‌స్టేషన్లకు వచ్చి బిల్లులు చెల్లించుకొనే వెసులుబాటు ఉంది. అయినప్పటికీ సుదూర కొండ శిఖర ప్రాంతాలకు చెందిన వారు విద్యుత్ బిల్లులు కట్టడానికి కిందకు దిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క యాప్ ఎలా వినియోగించాలి అనే దానిపై విద్యుత్ సిబ్బంది కనీసం అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించలేదు. దీంతో ఏజెన్సీలో విద్యుత్ బిల్లులు చెల్లింపుపై గందరగోళం నెలకొంది. ఈ విషయమై ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణమూర్తి వివరణ కోరగా.. 'విద్యుత్ బిల్లుల చెల్లింపునకు సంబంధించి గ్రామాల్లో కలెక్షన్ ఏజెంట్లు ఉన్నారు. వారి వద్ద చెల్లించవచ్చు. లేనిపక్షంలో ఆండ్రాయిడ్ ఫోన్లు ఉన్న వారి నుంచి ఆన్‌లైన్ పేమెంట్లు చేసుకొనే వీలుంది.' అని తెలిపారు.



మట్టికట్టలు కోతకు గురికాకుండా చూడాలి

- శివారు ప్రాంత రైతులపై దృష్టిసారించాలి
- తోటపల్లి ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి, జూలై 25: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని మట్టికట్టలు కోతకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం ఉల్లిభద్ర సమీపంలో కుడి ప్రధాన కాలువతో పాటు ప్రాజెక్టు, స్పిల్‌వే రెగ్యులేటర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో కుడి, ఎడమ మట్టికట్టలు, ప్రధాన కాలువల నిర్వహణపై అలసత్వం వహించరాదన్నారు. నాగావళి నదికి పైనుంచి వర్షా కాలంలో ఏ మేర వరద వస్తుంది, మిగతా సమయంలో ఎంతమేర వస్తుందని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం ఎంత, ఎంతమేర విస్తీర్ణానికి సాగునీరందుతుంది, శివారు ప్రాంతాలకు చేరుతుందా, ఎన్ని క్యూసెక్కుల మేర నీరు వృథాగా పోతుందన్న వివరాలను తెలుసుకున్నారు. ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు పునరావాసం, వారికి మౌలిక వసతులు కల్పనపై ఆరా తీశారు. వరద అధికంగా వచ్చిన సమయంలో ప్రధాన స్పిల్‌వే గేట్లు మొరాయించకుండా చూసుకోవాలని సూచించారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను శాస్త్రీయ, సాంకేతికతతో శాశ్వతంగా తొలగించేందుకు దృష్టి సారించాలన్నారు. ప్రధాన కాలువల పర్యవేక్షణకు అవసరమైన లస్కర్ల నియామకం జరగలేదని డీఈ టి.రఘునాథనాయుడు కలెక్టర్‌కు చెప్పారు. 40 మందికిపైగా లస్కర్ల అవసరం ఉంటుందని, పిల్ల కాలువలకు సంబంధించి కొంతమేర భూమి సేకరించాల్సి ఉందని, పలు గ్రామాల్లోని రీచ్‌ల వద్ద కాంక్రీటు లైనింగ్ పనులు నిర్వహించాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టు ప్రాంతంలో రైతులు అసౌకర్యానికి గురికాకుండా, ప్రతి ఎకరాకు సాగునీరందించేలా కృషి చేయాలని కోరారు. శివారు ప్రాంత రైతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రాజెక్టులో మిగులు పనులకు అవసరమైన నిధులు మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

వ్యాపార నైపుణ్యాలను పెంచుకోవాలి..

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: వ్యాపార నైపుణ్యాలను పెంచుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సూచించారు. నైపుణ్యాలతో అద్భుతమైన అవకాశాలు వస్తాయని, పలువురికి ఉపాధి కల్పించినవారు అవుతారని చెప్పారు. పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఔత్సాహిక పారి శ్రామికవేత్తల అవగాహన సదస్సు గురువారం జరిగింది. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, ఇతర రంగాలను విభజించి వాటి వివరాలు క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. అర్హత, వనరులు ఉన్న అభ్యర్థులకు రుణాల మంజూరులో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అవసరమైన వారికి శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కోటి రూపాయలు వరకు రుణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సీతానగరం మండలానికి చెందిన ఔత్సాహికురాలు బంకూరు హేమలత మాట్లాడుతూ.. తనకు రుబ్బు మిషన్ ఉందని, దానిని విస్తరించడానికి ప్రయత్నిస్తున్నామని, రుణాలు మంజూరు చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలం రావివలస గ్రామానికి శీరపు శంకరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకం కింద రుణాలు పొంది యూనిట్ నెలకొల్పి ఆరు కుటుంబాలకు ఉపాధి కల్పించామని తెలిపారు. ఈ సదస్సులో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దినేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ బి.బి.సాహు, ఖాదీ పరిశ్రమల బోర్డు అభివృద్ధి అధికారి రవికుమార్ పాల్గొన్నారు.



పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పోలవరం.. మూడేళ్లలో పూర్తి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయకపోగా.. నాశనం చేసిందని.. దరిమిలా రూ.30 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపే నిమిత్తం గురువారం సాయంత్రం అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని, ఇందుకు కేంద్రం సహకరించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. పోలవరం పూర్తిచేసే బాధ్యతను కేంద్రం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 'ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే 960 మెగావాట్ల జల విద్యుత్కేంద్రం ఉత్పత్తిలోకి వచ్చేది. అది అందుబాటులోకి రాకపోవడం వల్ల చాలా ఎక్కువ ధరకు బయట నుంచి కరెంటు కొనాల్సి వస్తోంది. పంటలకు కూడా ప్రాజెక్టు నీరు అందుబాటులోకి రాలేదు. ఇవన్నీ లెక్కవేస్తే నష్టం రూ.30 వేల కోట్ల వరకు తేలుతోంది' అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరు.. మలిదశలో 45.72 మీటర్ల కాంటూరులో నిర్మాణాలంటూ సందేహాలకు తావివ్వకుండా.. గరిష్ఠ నీటి నిల్వ 196.40 టీఎంసీ మేర ప్రాజెక్టు నిర్మాణం సాగాలని.. ఆ మేరకు కేంద్రం సహకరించి నిధులివ్వాల్సిందిగా కోరదామని చెప్పారు. 'కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని కేంద్ర జల సంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా తీసుకున్న నిర్ణయం మేరకు.. కేంద్రం స్పందించి.. సకాలంలో ఆదేశాలు జారీ చేయాలి. కేంద్రం త్వరితగతిన నిర్ణయం తీసుకుంటే.. ఈ ఏడాది నవంబరు నుంచే పనులు ప్రారంభించే వీలుంటుంది' అని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం.

> పోలవరం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని కేంద్ర బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం శుభపరిణామం. రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు.
>
> జగన్ వచ్చాక ఎగువ కాఫర్ డ్యాం పనులు చేయకుండా గ్యాప్‌లను అలాగే వదిలేయడంతో 2020 వరదలకు భారీ గుంతలు ఏర్పడి డయాఫ్రం వాల్ దెబ్బతింది. పీపీఏ సూచించినా పూర్తి నిర్లక్ష్యం చేశారు. రెండేళ్లపాటు పనులే చేపట్టలేదు.

వెంటనే తిప్పికొట్టాలి..: తప్పుడు ప్రచారం చేయడంలో వైసీపీ ఆరితేరిందని, ఉపేక్షించకుండా అవసరమైన సందర్భాల్లో మంత్రులు తక్షణం వాటిని తిప్పికొట్టాలని కేబినెట్ నిర్ణయించింది. '2019 ఎన్నికల ముందు జగన్‌పై జరిగిన కోడి కత్తి దాడిని మనం పెద్ద సీరియస్‌గా తీసుకోలేదు. అలాగే బాబాయి హత్యను వాళ్ళు చేసి మనపై తోసివేసినా మనం అంత బలంగా స్పందించలేదు. వాటి ప్రభావం ఉండదనుకున్నాం. కానీ అవి ప్రభావం చూపాయి. ఈసారి ఎన్నికల ముందు జగన్‌పై గులకరాయి దాడి జరిగిన వెంటనే మనం స్పందించి అది డ్రామా అని విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాం. పెద్దఎత్తున ప్రచారం చేశాం. అప్పటికే జగన్ వ్యవహారాలు వారికి అర్థమై గులకరాయి దాడిని నమ్మలేదు. కొద్ది రోజుల క్రితం వినుకొండలో ఇద్దరు వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగి అందులో ఒకరు హత్యకు గురైతే.. జగన్ దానిని మన పార్టీకి పూయాలని చూశారు. రాష్ట్రంలో 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ ఢిల్లీ వెళ్లి యాగీ చేయాలని చూశారు. చనిపోయిన వారి పేర్లు ఇవ్వాలని జాతీయ మీడియా అడిగితే సమాధానం చెప్పలేక జగన్ వెళ్లిపోయారు. ఇటువంటివి మనం కూడా అందుకోవాలి. ప్రతి దుష్ప్రచారాన్నీ తిప్పికొట్టాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ శ్రేణులు ప్రతీకార దాడులకు, కక్ష సాధింపు చర్యలకు దిగవద్దని తాను పదేపదే ఉద్దేశపూర్వకంగానే చెబుతున్నానని అన్నారు. 'జగన్ మనపై ఎన్నో దాడులు చేశాడు. చేయాల్సినంత అరాచకం చేశాడు. కానీ మళ్లీ గెలవగలిగాడా? వాళ్లు చేసిన అరాచకానికి చట్టప్రకారం శిక్ష పడేలా చూద్దాం. చట్టాన్ని మన చేతుల్లోకి తీసుకోవడం ఎందుకు? చట్టం తన పని తాను చేసుకుంటుంది' అని వ్యాఖ్యానించారు. కాగా... గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని కేబినెట్ ధ్రువీకరించింది.

ప్రతి మంత్రికి ఎంబీఏ ఎగ్జిక్యూటివ్

» ప్రతి పేషీలో 8 మంది ఉద్యోగులు

కేబినెట్‌లోని ప్రతి మంత్రికీ ఎంబీఏ చదివిన ఒక ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌ను పాలనా వ్యవహారాల్లో సహాయకారిగా నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రుల పేషీల్లో ఉండాల్సిన సిబ్బందికి సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రుల పేషీల్లో సిబ్బంది నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలపాల్సి ఉండడంతో గురువారంనాటి సమావేశంలో సంబంధిత తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించారు. దీని ప్రకారం ప్రతి పేషీకి 8 మంది చొప్పున సిబ్బందిని మంజూరు చేశారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పోస్టు కూడా ఉంది. గతంలో ఈ పదవి లేదు. దీనిని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసి సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం ఈ పోస్టును కొత్తగా సృష్టించారు. మంచి వారిని చూసి పేషీల్లో సిబ్బందిగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంత్రుల కార్యాలయాల్లో ఆరోగ్యకర వాతావరణం ఉండాలని, శాఖాపరమైన అంశాలపై వెంటనే ప్రతిస్పందించే వారిని చూసి పెట్టుకుంటే ఫలితాలు బాగా ఉంటాయని తెలిపారు.



990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్!

» నిర్మాణానికి అనుమతివ్వండి

» పోలవరం తొలి దశ పనులకు తక్షణమే రూ.12,157 కోట్లివ్వండి

» కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రంవాల్ దెబ్బతిన్నందున రూ.990 కోట్లతో కొత్త వాల్‌ను నిర్మించేందుకు రాష్ట్ర కేబినెట్ కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి కోరింది. ప్రాజెక్టు తొలిదశ పనులు పూర్తిచేసేందుకు తక్షణమే రూ.12,157.53 కోట్లు అడ్వాన్సుగా విడుదల చేయాలని అభ్యర్థించింది. ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంజరిగింది. 41.15 మీటర్ల కాంటూరులో తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని కేంద్రం రూ.30,436.95 కోట్లకు ఆమోదించిందని గుర్తుచేసింది. ఇందులో ఇంకా రూ.12,157.53 కోట్లు రావలసి ఉన్నందున ఈ మొత్తాన్ని అడ్వాన్సు రూపంలో ముందస్తుగా ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఇలా ముందస్తుగా నిధులు మంజూరు చేయడం వల్ల దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నిర్మాణాన్ని పట్టాలెక్కించి త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుంటుందని పేర్కొంది. ఇక ప్రాజెక్టు రెండోదశలో 45.72 మీటర్ల కాంటూరులో 194.60 టీఎంసీలు నిల్వ చేసేలా పనులు చేపట్టేందుకు అంచనాలు సవరించాలని కోరింది. సవరించిన అంచనా వ్యయాన్ని త్వరలోనే కేంద్రానికి అందజేస్తామని తీర్మానంలో వెల్లడించింది. 'ఈ నెల 3న కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా ఆధ్వర్యంలో అంతర్జాతీయ నిపుణులతో, రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్ సాయిల్-మినరల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు, కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో పాత డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేసే బదులు కొత్తది నిర్మించాలన్న నిర్ణయం జరిగింది. ఈ నేపథ్యంలో కొత్త వాల్ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇవ్వాలి. అలాగే పోలవరం ఎడమ కాలువ, కుడి కాలువల ద్వారా 8,123 క్యూసెక్కులు, 11,654 క్యూసెక్కుల వరద ప్రవాహ సామర్థ్యంతో నిర్మాణాలను చేపడతామని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నాం. ఇప్పుడు రెండు కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచేందుకు అనుమతి ఇవ్వండి. ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర పర్యావరణ, అటవీశాఖ తరచూ స్టాప్ వర్క్ ఆర్డర్ ఇస్తుండడం.. నిర్మాణానికి ఆటంకంగా మారింది. అందుచేత నిర్మాణ పనులపై నిషేధాన్ని శాశ్వతంగా ఎత్తివేయాలి' అని విజ్ఞప్తి చేసింది. కేబినెట్ ఇంకా ఏమని తీర్మానించిందంటే..

ఈ ఐదేళ్లలో విధ్వంసం..

2014-19 మధ్యకాలంలో పోలవరం ప్రగతి పరుగులు తీసింది. 2019 మేనాటికి 72శాతం పనులు పూర్తి చేశాం. కానీ 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టు విధ్వంసానికి గురైంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎగువ కాఫర్ డ్యాం పనులు పూర్తి చేయలేదు. పీపీఏ సూచించిన రెండు గ్యాప్‌లు పూడ్చలేదు. 2019, 20ల్లో పనులే చేపట్టలేదు. భూసేకరణ పూర్తి చేయలేదు. గ్యాప్‌లు పూడ్చకపోవడంతో.. గోదావరి వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యాం పునాదులకు సమీపంలో భారీగుంతలు పడ్డాయి.

భారీ వరద కారణంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం గ్యాప్-1 వద్ద భారీగోతులు ఏర్పడ్డాయి. గ్యాప్-2 ప్రాంతంలోనూ భారీ గుంతలు పడ్డాయి. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో భారీగా సీపేజీ ఎగదన్నుతోంది. 500 మీటర్ల మేర నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. 2020 గోదావరి వరదల తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు నాలుగేళ్ల పాటు ముందుకు కదలకుండా నిలిచిపోయాయి. ప్రాజెక్టు సకాలంలో పూర్తికాక.. సాగు నీరందక రైతులు రూ.3,700 కోట్ల మేర పంట నష్టపోయారు. జలవిద్యుత్కేంద్రం సకాలంలో పూర్తికానందున 3,000 కోట్లు నష్టం వాటిల్లింది.

30 లక్షల ఎకరాలకు సాగునీరు..

పోలవరం ప్రాజెక్టును 194.6 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించాలని నిర్ణయించాం. దీనివల్ల 23.5 లక్షల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించడమే గాక కొత్తగా 7.2 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావచ్చు. తాగునీటి అవసరాలకు 4.9 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 18.5 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం ఉంది. జల విద్యుత్కేంద్రం ద్వారా 960 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి అవుతుంది. పోలవరం నిర్మాణ బాధ్యతను పూర్తిగా తీసుకుంటానని బడ్జెట్‌లో ప్రతిపాదించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. 45.72 మీటర్ల కాంటూరు మేరకు 194.60 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నిర్మించాలన్న నిర్ణయానికి కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఇందుకు కేంద్రం పూర్తిగా సహకరించి అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలి.

డీటీ, ఐటీ వినియోగంలో
ట్రాన్స్‌కోకు అవార్డులు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, ఐటీ వినియోగంలో ట్రాన్స్‌కోకు సౌత్ గవ్‌టెక్ సింపోజియం అవార్డులు దక్కాయి. వినియోగదారుల విద్యుత్తు వాడకానికి సంబంధించి మీటరు రీడింగ్ అప్లికేషన్లలో ఐటీ వినియోగానికి గాను సౌత్ గవ్ టెక్ 2024 అవార్డు దక్కింది. ఐటీ రంగానికి సంబంధించి ట్రాన్స్‌కో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ టెక్నాలజీలోనూ ఈ అవార్డును దక్కించుకుంది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నాయకత్వంలోని అధికారుల బృందం హైదరాబాద్‌లో బుధవారం రాత్రి సౌత్ గవ్ టెక్ సింపోజియంలో అవార్డులను అందుకుంది. డిజిటల్ ట్రాన్స్‌మిషన్ ఎక్స్‌లెన్స్ విభాగంలో జాయింట్ మీటర్ రీడింగ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఐటీ ఇన్నోవేషన్స్‌లో ఏపీ ట్రాన్స్‌కో అనుసరిస్తున్న విధానాలపై అవార్డు దక్కింది. ఈ అవార్డులను దక్కించుకున్నందుకు సీఎం చంద్రబాబు గురువారం ఇంధన శాఖ అధికారులను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై
కట్టుదిట్టమైన చర్యలు

» ఆరోగ్యశాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశాలు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. గురువారం మంగళగిరి ఏపీఐఐసీ భవనంలో ఆరోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై ఆయన సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు అవగాహన, ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా ప్రబలేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియాపై 24 గంటలూ పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై
అక్రమ కేసుల ఎత్తివేతపై హర్షం

విజయవాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలపై వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను రద్దు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు గురువారం అసెంబ్లీలో ప్రకటించడంతో ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీ మరియదాస్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చిరంజీవి, హృదయరాజు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలను ప్రశ్నించినందుకు ఉద్యోగులు, అధికారులపై కేసులు నమోదు చేసిన విషయాన్ని శాసనభ సాక్షిగా ప్రపంచానికి తెలిపినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఐక్యవేదిక చైర్మన్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేస్తున్నట్టు సీఎం అసెంబ్లీలో ప్రకటించడాన్ని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ-ఏపీజీఈఏ జేఏసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన జీపీఎస్ చట్టాలను కూడా అసెంబ్లీ వేదికగా రద్దు చేయాలని కోరారు.

రోడ్లపైకే మురుగు

- వాహనాల రాకపోకల సమయంలో దారంతా అధ్వానం
- ఇబ్బందులకు గురవుతున్న స్థానికులు, ప్రయాణికులు
- డ్రైనేజీ వ్యవస్థ లేకుండానే నిర్మాణాలకు అనుమతులు



అధికారుల అలసత్వం, ప్రజల నిర్లక్ష్యం వెరసి పంచాయతీలో పరిస్థితులు అధ్వానంగా తయారవుతున్నాయి. నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో వ్యవస్థలు బలహీనమై, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి నిదర్శనమే ఈ చిత్రం. శృంగవరపుకోట మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న విశాఖ-అరకు రోడ్డులో పారుతున్న మురుగునీరిది. ఈ రోడ్డు పక్కనున్న భవనంలో నివసిస్తున్న వారంతా వాడిన నీరు ఇళ్ల నుంచి నేరుగా బయటకు వదిలేస్తున్నారు. దీంతో ఈ నీరంతా రోడ్డుపైనే పారుతుంది.

శృంగవరపుకోట: అధికారుల అలసత్వం, ప్రజల నిర్లక్ష్యం వెరసి పంచాయతీలో పరిస్థితులు అధ్వానంగా తయారవుతున్నాయి. నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో వ్యవస్థలు బలహీనమై, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి నిదర్శనమే ఈ చిత్రం. శృంగవరపుకోట మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న విశాఖ-అరకు రోడ్డులో పారుతున్న మురుగునీరిది. ఈ రోడ్డు పక్కనున్న భవనంలో నివసిస్తున్న వారంతా వాడిన నీరు ఇళ్ల నుంచి నేరుగా బయటకు వదిలేస్తున్నారు. దీంతో ఈ నీరంతా రోడ్డుపైనే పారుతుంది. అత్యంత రద్దీగా ఉండే ఈ వ్యాపార కూడలిలో నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి చోట వాణిజ్య, నివాసిత భవనాల నుంచి మురుగు నీరు రోడ్లపైకి వదిలేయడంతో విశాఖ-అరకు రోడ్డు మురుగు మయం అవుతోంది. ఇక్కడొక చోటే ఇలా జరుగుతుందనుకుంటే పొరపాటే. చిన్నపంచాయతీల నుంచి పట్టణాల వరకు మురుగు కాలువల్లో ప్రవహించాల్సిన వాడుక నీరు రోడ్లు, ఖాళీ స్థలాల్లో పారుతోంది. చెత్త, చెదారంతో కలసి పరిసరాలన్నీ అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి ప్రజారోగ్యానికి సవాలుగా మారుతోంది.

శృంగవరపుకోట, కొత్తవలస, చీపురుపల్లి, గజపతినగరం పేరుకే మేజర్ పంచాయతీలు. ఈ నాలుగు పంచాయతీల్లోను పట్టణ ప్రాంతాలను మించి బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారులకు ఆనుకుని అనేక రకాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే క్రమంలో ఈ స్థలాలన్నీ చట్టబద్ధంగా ఉన్నాయా? మురుగునీరు పోయేందుకు అవసరమగు మార్గాలు ఉన్నాయా? అన్న విషయాలను అధికారులు పరిశీలించడం లేదు. క్షేత్రస్థాయిలో చూడకుండా పారిశుధ్య నిర్వహణ అధికారి పరిశీలన ఆధారంగా నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసేస్తున్నారు. ఇదే ఇప్పుడు రోడ్లపైకి, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచేందుకు అవకాశం ఇస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం నిర్లక్ష్యమే దీనంతటికీ కారణం.

పంటకాలువలు కనుమరుగడంతో..

గతంలో రోడ్ల కింద నుంచి పంట కాలువలు ఉండేవి. వర్షాకాలంలో వరద నీరు వీటి నుంచి పోయేది. రోడ్లకు అనుకుని ఉన్న ఇళ్ల నుంచి వచ్చే నీరు కూడా వీటిల్లోకే వెళ్లేది. అయితే కాలక్రమంలో రోడ్డుకు ఆనుకుని జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో భాగంగా ఈ కాలువలను కప్పేస్తున్నారు. దీంతో వర్షాలు పడినప్పుడు రోడ్డుపైనే నీరు నిలుస్తోంది. దీనికితోడు మురుగు కలుస్తుండడంతో మరింత అపరిశుభ్రంగా రోడ్లు తయారవుతున్నాయి. ప్రస్తుతం పట్టణాలతో పాటు గ్రామాలు విస్తరిస్తున్నాయి. వీటికి ఆనుకుని పుట్టగొడుగుల్లా లేఅవుట్‌లను తీర్చిదిద్దుతున్నారు. ఈ లేఅవుట్‌ల్లో మౌళిక సదుపాయాల కల్పనకు అవసరమగు భూమిని పంచాయతీ, మున్సిపాల్టీ, పుర పాలక సంఘాలకు అందించాలి. నివాసయోగ్యంగా స్థలాలను తీర్చిదిద్దాలి. విశాఖ మెట్రోపాలిటిన్ గ్రామీణాభివృద్ధి ఆథార్టీ (వీఎంఆర్‌డీఏ) నుంచి అను మతులు తీసుకోవాలి. మురుగునీటి వ్యవస్థకు అవసరమగు సదుపాయాలు ఉన్న లేఅవుట్‌లకు మాత్రమే ఈ సంస్థ అనుమతి ఇస్తుంది. దీంతో లేఅవుట్‌ల యజమానుల్లో చాలా మంది ఈ సంస్థ అనుమతులు పొందడం లేదు. వీటిల్లో ఎక్కడా రోడ్లు, మురుగు కాలువలు లేనప్పటికీ పంచాయతీ, పట్టణ ప్రణాళిక విభాగంలో ఉన్న చిన్న చిన్న లొసుగులను అడ్డంపెట్టుకుని అనుమతులు ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం వాణిజ్య గృహనిర్మాణాలతో పాటు బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలకు అను మతులు ఇచ్చేటప్పుడు ప్రధానంగా మురుగు నీటి వ్యవస్థను చూడాలి. ఈ వ్యవస్థ సక్రమంగా ఉంటేనే అనుమతులు ఇవ్వాలి. లేదంటే అనుమతులను తిరస్కరించాలి. కానీ రాజకీయ నేతల ఒత్తిడితో పాటు అధికారులు అక్రమ సంపాదనకు అలవాటు పడడంతో ఇవేమీ చూడకుండా అనుమతులు ఇచ్చేస్తుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

డ్రైనేజీలు లేకపోతే అనుమతులు ఇవ్వొద్దు



పంచాయతీ పాలక మండలి సాదారణ సమావేశంలో సర్పంచ్ గనివాడ సంతోషి

శృంగవరపుకోట: డ్రైనేజీ వ్యవస్థ లేకుండా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని శృంగవరపుకోట మేజర్ పంచాయితీ అధికారులకు వార్డు సభ్యులు సూచించారు. గురువారం పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన పాలక మండలి సాధారణ సమావేశం నిర్వహించారు. కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతుల కోసం వచ్చిన యజమానుల వివరాలను పంచాయితీ అధికారులు చదివి వినిపించారు. అనుమతులేని లేఅవుట్లు, చెరువు గర్భాలు, డ్రైనేజీ వ్యవస్థ లేని విశాఖ-అరకు రోడ్డుకు అనుకుని ఇళ్ల నిర్మాణాల దరఖాస్తులకు అభ్యంతరం తెలిపారు. ఇలాంటి స్థలాల్లో నిర్మించిన ఇళ్ల నుంచి మురుగు నీరు రోడ్లపైకి వస్తుందని, వాటిని తిరస్కరించాలని సూచించారు. ప్రైవేటు కళాశాలలు, ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి పన్నులు ఎందుకు వసూలు చేయడం లేదని ఉప సర్పంచ్ మోపాడ కుమార్ నిలదీశారు. బహుళ నిర్మాణ యజమానుల నుంచి పన్నులు వసూలు చేయకుండా ఆదాయం లేదనే సాకుతో పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేకపోతున్నామని చెప్పడం సరికాదన్నారు. పంచాయతీ స్థలం అక్రమణ జరుగుతున్నా పట్టించుకోకపోవడాన్ని తప్పుపట్టారు. పంచాయితీ అద్దె గదుల విషయంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దృష్టిలో పెట్టిన తరువాత నిర్ణయం తీసు కుందామన్న ఏకాభిప్రాయానికి వచ్చారు. పంచాయితీ కార్యనిర్వాక కార్యదర్శి వి.వి. అనురాధ, వార్డు సభ్యులు కాపుగంటి శ్రీనివాసరావు, మజ్జి శేఖర్, అనకాపల్లి చెల్లయ్య, సరిపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



స్వాతి (ఫైల్)

మెంటాడ: మీసాలపేట గ్రామానికి చెందిన గంట్యాడ స్వాతి (27) అనే వివాహిత గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గజపతినగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న మేనమామ (అమ్మ తమ్ముడు) సత్యనారాయణతో స్వాతికి 2017లో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల పాప ఉంది.భార్యాభర్తల మధ్య కొన్నాళ్లుగా మనస్పర్థలు తలెత్తాయి. తరచూ గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కూడా స్థానిక పెద్దలను కలిసి స్వాతి తన గోడు వినిపించుకుంది. పెద్దలు సర్ది చెప్పి పంపించారు. భర్త సత్యనారాయణ ఉదయం విధులకు, అత్త వ్యవసాయ పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి స్వాతి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. అచేతనంగా ఉన్న తల్లిని చూసి కుమార్తె ఏడుస్తుండడంతో స్థానికులు వెళ్లి పరిశీలించారు. అప్పటికే స్వాతి మృతి చెందింది. ఈమేరకు ఆండ్ర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మద్యం, నాటుసారా ధ్వంసం

పాలకొండ: పాలకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా పట్టుబడిన మద్యం, నాటుసారాను గురువారం డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. వివిధ తనిఖీల్లో పట్టుబడిన 436.5 లీటర్ల నాటుసారాను, 450 మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్టు డీఎస్పీ వివరించారు. ఒక కారు, ఏడు ద్విచక్ర వాహనాలను వేలం వేశారు. వాహనాలను మొత్తం రూ.96,052కు పాటదారులు కొనుగోలు చేశారు. డీఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ యువత, ప్రజలు మద్యానికి, నాటుసారాకు, గంజాయికి బానిస కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొమరాడ: సారా విక్రయిస్తున్న గుమడకు చెందిన మండంగి వెంకట్‌ను కొమరాడ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం గుమడ సమీపంలో విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 20 లీటర్ల సారా క్యాన్‌తో ఉండడాన్ని గమనించారు. ఈ మేరకు పోలీసులు వెంకట్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

లారీ సిబ్బందికి విద్యుదాఘాతం

కురుపాం రూరల్: గుమ్మలక్ష్మీపురం నుంచి తుని వెళ్తున్న జీడిపిక్కల కంటైనర్ విద్యుదాఘాతానికి గురయ్యింది. మూలిగూడ జంక్షను వద్ద కరెంట్ వైర్లు కాస్త కిందకి ఉండడం, కంటైనర్ ఎత్తు ఎక్కువగా ఉండడంతో విద్యుత్ వైర్లు కంటైనర్‌కు తగిలాయి. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో కంటైనర్‌కు వైర్లు తగిలిన వెంటనే కరెంట్ ట్రిప్ కావడంతో స్వల్ప షాక్‌తో లారీ సిబ్బంది బయటపడ్డారు. వీరికి కురుపాం ఆసుపత్రిలో చేర్పి చికిత్స చేశారు. లారీ సిబ్బందికి ప్రాణాపాయం లేదని వైద్య సిబ్బంది తెలిపారు.

గొర్లె సీతారాంపురంలో 8 తులాల బంగారం చోరీ

బొబ్బిలి: బొబ్బిలి మండలం గొర్లె సీతారాంపురంగ్రామంలో భాస్కరరావు ఇంట్లో ఈ నెల 23న జరిగిన చోరీలో 8 తులాల బంగారు ఆభరణాలు పోయినట్లు తమకు గురువారం ఫిర్యాదు అందిందని ఎస్ఐ లోవరాజు తెలిపారు. ఈ నెల 20న బీరువాలో పెట్టిన బంగారు ఆభరణాలు 23న చూసేసరికి కనిపించలేదని ఫిర్యాదుదారు తెలిపాడన్నారు. క్లూస్‌టీమ్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించిందని, ఈ చోరీ ఎలా జరిగిందన్న దానిపై ఆరా తీస్తున్నామని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పురిటిపెంటలో చోరీ

గజపతినగరం: పురిటిపెంట న్యూ కాలనీలో గురువారం తెల్లవారు జామున ఓ ఉద్యోగి ఇంటిలో చోరీ సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం శాఖా గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తున్న స్వప్న భర్త పొందూరు రాము శ్రీకాకుళంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల పురిటిపెంట మండలవారి కాలనీలో నూతనంగా ఇల్లు కట్టుకున్నారు. రాత్రి 9 గంటల తరువాత కొత్త ఇంటికి వెళ్లి ఉదయం 5 గంటలకు అద్దె ఇంటికివస్తు న్నారు. బుధవారం రాత్రి కూడా కొత్త ఇంటికి వెళ్లి ఉదయం వచ్చేసరికి తలుపుల గెడలు పగిలి ఉండడంతో పాటు లోపల వస్తువులు చిందరవందరగా పడి ఉన్నా యి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండున్నర తులాల బంగారం, కొంత నగదు పోయినట్లు పొందూరు రాము చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశా మన్నారు. విజయనగరం నుంచి క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించిందని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

ఎస్.కోట డిపో తనిఖీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపోను విజయనగరం డిప్యూటీ సీఎంఓ కె.శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేసారు. గ్యారేజ్‌లోని అన్ని సెక్షన్‌లు, డిజిల్ అయిల్ విభాగంను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. డిపో మేనేజర్ కె.రమేష్ వున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు తెలిపారు. రాజనీతి శాస్త్రం, కామర్స్, భౌతిక శాస్త్రం, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు అర్హత ఉన్నవారు ఈనెల 28 సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

'నా భూమిని దున్నేశారు'

బొబ్బిలిరూరల్: మండలంలోని గున్నతోటవలస గ్రామంలో 40 సంవత్సరాల నుంచి తన స్వాధీనంలోఉన్న జిరాయితీ భూమిని రియల్‌ఎస్టేట్ వ్యాపారి బుధవారం రాత్రి దున్నేశారని కుప్ప రమణమ్మ ఆరోపించింది. ఈ మేరకు గురువారం ఆమె స్థానిక డీఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఇప్పటికే తహసీల్దారుకు, పోలీసులకు ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని రమణమ్మ కోరింది.

రేపు పారాదిలో జూనియర్ సాఫ్ట్‌బాల్ సెలెక్షన్స్

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 27 న జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఐ.విజయ్‌కుమార్, పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు. ఎంపికైన జట్టు వచ్చే నెల 17 నుంచి మూడు రోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

నేడు ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్

రామభద్రపురం: మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామని ఎంపీడీవో చుక్కా ఈశ్వరమ్మ తెలిపారు. 22 గ్రామపంచాయతీల్లో ఏప్రిల్ 1, 2023 నుంచి 31, మార్చి 2024 వరకు జరిగిన ఉపాధిహామీ పథకం పనులు, హౌసింగ్‌తదితర వాటిపై ఈ ఆడిట్ జరగనుందని తెలిపారు.

'ఆరోపణలకు కట్టుబడి ఉన్నా'

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్యపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, ఆయా ఆరోపణలు రుజువు చేస్తానని ఉత్తరాంధ్ర విద్యార్థిసేన నాయకుడు సుంకరి రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను ఆయనపై న్యాయ విచారణ కోరానని, తన వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని, ఆరోపణలు నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

టోల్‌గేట్‌పై పునరాలోచన చేయండి

విజయనగరం రూరల్/గంట్యాడ: విజయనగరం నుంచి విశాఖపట్టణం వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌పై పునరాలోచన చేసి, వెంటనే ఎత్తివేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఒక లేఖ రాశారు. బైపాస్‌లో ఏర్పాటు చేయాల్సిన ఈ టోల్‌గేట్‌ని జొన్నాడ వద్ద ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మందిపై భారం పడుతుందని, దీనిని పరిశీలించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ టోల్ ప్లాజాను కొత్తగా నిర్మించిన విజయనగరం బైపాస్ రోడ్డులోకి తరలించాలని కోరారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన

లక్కవరపుకోట(కొత్తవలస): బాలికల ఆరోగ్యంపై జిల్లా ఆర్‌బీఎస్‌కే.కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం గురువారం అవగాహన కల్పించారు. మండలంలోని వియ్యంపేటలో గల బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. బాలికల ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 9,10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసదేవి, ఈవో నరసింహారావు, పద్మావతి పాల్గొన్నారు.

రేపు బియ్యం బహిరంగ వేలం

రాజాం: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ ఆవరణలో ఈ నెల 27న 19 క్వింటాల బియ్యం బహిరంగ వేలం వేయనున్నట్టు సీఎస్‌డీటీ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. పాటదారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం: నేడు గోపాలపురం సబ్ స్టేషన్ పరిధిలోని కంచరాం ఫీడర్ కు సంబంధించి చెట్లు నరికివేత చర్యలు చేపడుతున్నందున మండల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విజయనగరం రింగురోడ్డు: తోటపాలెం, 11కేవీ వంటితాడి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించడం, నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎస్ఈ లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రులతో బేబీనాయన భేటీ



మంత్రి ఫరూక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన, న్యాయవాదులు

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) సంబంధిత మంత్రులందరినీ నేరుగా కలిసి మాట్లాడారు. బొబ్బిలిలో నిర్మించబోయే కోర్టు భవనాల సముదాయానికి నిధులను మంజూరు చేయాలని న్యాయశాఖామంత్రి నాస్యం మహ్మద్ ఫరూక్‌ను, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గిరిజనశాఖామాత్యులు గుమ్మిడి సంధ్యారాణి తదితరులను గురువారం కలుసుకున్నారు. బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహనమురళీకుమార్, కొల్లి సింహాచలం, సీనియర్ న్యాయవాదులు చల్లారపు సత్యనారాయణ, కండాపు ప్రసాదరావుతో కలిసి అమరావతి సెక్రటేరియట్‌లో మంత్రులతో బేబీనాయన భేటీ అయ్యారు. నిధుల మంజూరు విషయంలో మంత్రులు సానుకూలంగా స్పందించారని బేబీనాయన తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని బాడంగి, రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి మండలాలకు చెందిన గిరిజన ప్రాంతాల సమస్యలను సంధ్యారాణి దృష్టికి తెచ్చారు.

30న మహాధర్నా

విజయనగరం దాసన్నపేట: విజయనగరం-విశాఖపట్టణం రహదారి మధ్యలో జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను వెంటనే తొలగించాలని కోరుతూ ఈ నెల 30న మహాధర్నా నిర్వహించనున్నట్టు జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామచంద్రరాజు, వెంకటరమణ, ఈశ్వర ప్రసాద్, గోపాలరావు, రొంగలి పోతన్న, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై సమాధానమివ్వండి

శృంగవరపుకోట రూరల్: ముషిడిపల్లి పంచాయతీలో ఆక్రమించిన పెద్ద బంద, జగన్నాథ చెరువును ఆక్రమించి లేఅవుట్‌లోకి తారురోడ్డు వేసిన వారు వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. గురవారం ఈ విషయంపై పంచాయతీ రెవెన్యూ అధికారి సూరిబాబు మాట్లాడుతూ చెరువులు ఆక్రమణకు గురయ్యాయని వచ్చిన ఫిర్యాదులపై సర్వే చేశామని, ఆర్‌డీవో స్వయంగా పర్యవేక్షించారని చెప్పారు. పెద్దబంద నాలుగు సెంట్లు, జగన్నాథ చెరువులో 8 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు తెలిపారు. ఆక్రమణదారుడు, విజయనగరానికి చెందిన గుడిసి శ్రీనువాసరావు, కొత్తనరిసింగరావు, షణ్ముఖ రియల్ ఎస్టేట్స్ వారికి నోటీసులు అందించినట్టు తెలిపారు. ఆక్రమణల విషయంపై గ్రామ సచివాలయం, చెరువుల వద్ద నోటీసులు అతికించామన్నారు.

వేలం పాట వాయిదా

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న ఖాళీ దుకాణాలకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియలో పాటదారులు అసమగ్రమైన వివరాలతో హాజరైనందున వాయిదా వేస్తున్నట్టు రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు వెల్లడించారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో రాజీవ్ స్పోర్ట్సు కాంప్లెక్స్‌కి ఆనుకొని ఉన్న 22 దుకాణాలకు, పాత, కొత్త ఐడీసీఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న షాపులకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. నిబంధనలను అనుసరించి వేలం పాట ప్రక్రియలో పాల్గొననందున వాయిదా వేస్తున్నట్టు రెవెన్యూ అధికారి తెలిపారు. తిరిగి ఈ నెల 26న శుక్రవారం షాపుల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నిధులు కేటాయించడం హర్షణీయం

విజయనగరం దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయించడం హర్షణీయమని జిల్లా శిష్టకరణ సంఘ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు కేటాయించడం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. వైసీపీ పరిపాలనలో జరిగిన దోపిడీ మీద సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ధరల బోర్డులు తప్పనిసరి

విజయనగరం రింగురోడ్డు: జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు, క్లినిక్‌లు, డయోగ్నిస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరపీ క్లినిక్‌లు, స్కానింగు సెంటర్లలో విధిగా టారిఫ్ బోర్డులు (ధరల పట్టిక) ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ .భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా టారిఫ్ బోర్డులు ఏర్పాటు చేయకపోతే, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ బోర్డులను తెలుగు, ఇంగ్లీషులో ఏర్పాటు చేయాలన్నారు.

వాహన తనిఖీలు

వేపాడ: మండలంలోని విశాఖ-అరకు ప్రధాన రహదారిలో గంజాయి రవాణాపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్ తన సిబ్బందితో బొద్దాం నాలుగు రోడ్ల కూడలిలో మాటు వేసి వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అరకు వైపు నుంచి విశాఖ వైపునకు వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి పూర్తిస్థాయిలో తనిఖీ చేసి విడిచిపెట్టారు. ఏఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో సముచిత స్థానం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్: రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో సముచిత స్థానం లభించిందని, ఇది చంద్రబాబు, కూటమి ఎంపీల ఘనతేనని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం కల్పించిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కి ధన్యవాదాలు తెలిపారు. తాజాగా అమరావతి నిర్మాణానికి ఒక్క ఏడాదికి రూ.15 వేలు కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం ప్రశంసనీయమన్నారు. టీడీపీ నగర, మండల అధ్యక్షులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక ప్రాధాన్యం లభించిందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలని కోరారు. టీడీపీ నాయకులు ఆల్తి బంగారుబాబు, కంది మురళీ నాయుడు, కర్రోతు నర్సింగరావు, పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, ముద్దాడ మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్య రక్షణ తప్పనిసరి

విజయనగరం రింగురోడ్డు: పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యక్తిగత ఆరోగ్య రక్షణ ఎంతో ముఖ్యమని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. డివిజన్ పర్యటనలో భాగంగా పూల్‌బాగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. పరిసరాల స్థితిగతులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడి విద్యార్థుల స్థితిగతులను తెలుసుకున్నారు.

పారిశుధ్యంపై దృష్టిసారించండి

లక్కవరపుకోట: అధికారులంతా ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యంపై దృష్టిసారించాలని జిల్లా విద్యాశాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్ చెప్పారు. గురువారం గనివాడలోని గ్రామ సందర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామమంతా తిరిగారు. మురుగునీటి వ్యవస్థ, పారిశుధ్యం మెరుగుపడాలన్నారు. అనంతరం జమ్మాదేవిపేట వద్దగల మహాత్మ జ్యోతిభాపూలే బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు.

కొండంపేటలో వార్డు దర్శిని

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని కొండంపేట గ్రామంలో వార్డుదర్శిని కార్యక్రమం కమిషనర్ రామప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తాగునీటి ఇబ్బందులు పరిష్కరించండి

రాజాం: గ్రామంలో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలని ఆగూరు మాజీ సర్పంచ్ నాగళ్ల అప్పలనాయుడు కోరారు. గురువారం గ్రామదర్శిని కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుమబాల ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగావళి నదినీరు గ్రామానికి రావాలంటే ప్రధానంగా చినకంచరాం సమీపంలో సంప్ ఏర్పాటు చేయాలని కోరారు.

రాష్ట్రానికి ఎంతో మేలు

విజయనగరం రూరల్: రాష్ట్ర రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎంతో మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి దక్కుతుందని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీమల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్ తెలిపారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గేదెల సతీష్, మైలిపిల్లి వాసు, పీకెఎల్ రాజు, నీతిన్, గౌరీ, విజయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులు సద్వినియోగం చేసుకోండి

తెర్లాం: కౌలు రైతు కార్డులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎవో సునీల్ కూమార్ అన్నారు. మండలంలో ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కౌలు రైతులకు ప్రత్యేకంగా అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. దీనితోపాటుగా కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తారన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు ప్రాధాన్యం

రామభద్రపురం: ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష తెలిపారు. గురువారం ఆసుపత్రిలో చేరిన వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు, నూకమ్మ, గౌరీశ్వరి, దీప్తిలకు సుఖప్రసవాలు చేయించారు. ఆసుపత్రి ప్రసవాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకునేలా చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులైన వారు ఇలా ఇక్కడ ప్రసవాలకు వస్తున్నారని తెలిపారు.

మెట్టవలసలో క్షేత్రసందర్శన

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి డాక్టర్ వీటీ రామారావు గురువారం క్షేత్రస్థాయి సందర్శన చేశారు. పత్తి పంటపొలాలను పరిశీలించారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేయాలి



ఎస్పీని సత్కరిస్తున్న అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్

క్రైం: జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం, సైబర్ నేరాలని యంత్రణకు కృషి చెయ్యాలని టీడీపీ నాయకులు అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్ కోరారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసు కుంటున్నారని, వీరికి అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీని కలిసిన వారిలో యువనాయకులు రౌతు చంటి, సతీస్, గంధ్రేటి శ్రీను, కుమార్ తదితరులు ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు



గురువారం సాయంత్రం పనులు చేపడుతున్న దృశ్యం

రాజాం: రాజాం నుంచి పాలకొండ వెళ్లే రహదారిలో స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశాల మేరకు తాత్కాలిక మరమ్మతు పనులు గురువారం రాత్రి ప్రారంభించారు. డోలపేట ఆంజనేయస్వామి ఆలయం నుంచి జీఎంఆర్ఐటీ వరకు జేసీబీతో గోతులు పూడ్చే చర్యలు చేపడుతున్నారు. రహదారికి భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవడంతో ఎమ్మెల్యే స్పందించి ఆర్ అండ్‌బీ అధికారులతో మాట్లాడి తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. త్వరలో ఈ రోడ్డు పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చంద్రబాబునాయుడు హామీయిచ్చారని కోండ్రు తెలిపారు. నోట్

హోరాహోరీగా అంతర్‌జోన్ క్రికెట్ పోటీలు

విజయనగరంటౌన్: విజయనగరం జిల్లా కేంద్రం విజ్జీస్టేడియం, పివిజీ రాజు నార్తైజోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో నిర్వహిస్తున్న అంతర్‌జోన్‌ల వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు హోరా హోరిగా జరుగుతున్నాయి. విజ్జీస్టేడియంలో గురువారం తూర్పుగోదావరి - అనంతపూర్ జట్లమధ్యజరిగిన క్రికెట్ మ్యాచ్‌లో తూ.గో జిల్లా జట్టు 4పరుగులు తేడాతో గెలుపొందింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 36 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన తూర్పుగోదావరి జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగులు సాధించింది. 214 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపూర్ జట్టు 36 ఓవర్లుకు 9 వికెట్లు నష్టపోయి 209 పరుగులు సాధించి ఓటమిపాలయ్యింది. ● పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో రెస్టాఫ్ సౌత్‌జోన్-రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్లమధ్య జరిగిన మరో మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ జట్టు 7వికెట్లు తేడాతో విజయం సాధించింది. సౌత్‌జోన్ జట్టు 37.5 ఓవర్లలో 152 పరుగులు చేయగా సెంట్రల్ జోన్ జట్టు 28.1 ఓవర్లలలో 3 వికెట్లకే 156 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

శాకంబరిగా జామి ఎల్లారమ్మ

జామి: జామి ఎల్లారమ్మతల్లిని ఆలయ ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో శాకంబరీగా అలంకరించారు. గురువారం అమ్మవారు భక్తులకు శాకంబరీగా దర్శనం ఇవ్వగా జిల్లా నలుమూలల నుంచి, చుట్టుపక్కల ప్రాంతాల రైతులు దర్శించుకున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు ● రహదారిపై రాస్తారోకో.. గాంధీ విగ్రహానికి నివాళులు

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. అమరావతికి 15 వేల కోట్ల రూపాయలను ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని అది పూర్తిగా అంకెల గారడీ తప్ప మరొకటి కాదన్నారు. వరల్డ్ బ్యాంకులో అమరావతి నిర్మాణానికి అప్పు చేసేందుకు బడ్జెట్‌లో అనుమతి ఇవ్వడం సిగ్గుచేటన్నారు.



ఎస్.కోటలో..



రామభద్రపురంలో..



లక్ష్మవరపుకోటలో..



బొబ్బిలిలో రాస్తారోకో



విజయనగరంలో..

నేడు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

పార్వతీపురం టౌన్: కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు రుణపడి ఉంటామని మన్యంజిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పార్వతీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట కార్గిల్ సరిహద్దుల్లో జూలై 25న పాకిస్తాన్‌పై భారత్ సైన్యం విజయం సాధించిందని గుర్తుచేశారు. అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ వీరోచిత నిర్ణయం వల్ల నాడు కార్గిల్ యుద్ధంలో పాక్‌సైనిక మూకపై భారత సైన్యం ప్రాణాలు అర్పించి విజయం సాధించిందని తెలిపారు. దేశం కోసం ప్రాణాల ర్పించిన వీర జవాన్లకు నీరాజనాలర్పిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్వతీపురంలో కాగడాల ర్యాలీ

పార్వతీపురంలో కార్గిల్ వీరుల విజయదివోత్సవ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. బెలగాంలోని పోలీసు అవుట్ పోస్టు వద్ద కార్గిల్ వీరుల సంస్మరణార్థం కాగడాల ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వీరఘట్టం: పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సీడీపీవో సిమ్మాలమ్మ పిలుపునిచ్చారు. గురువారం వీరఘట్టం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కిశోరీ బాలికల అవగాహన కార్య క్రమం నిర్వహించారు. కార్య క్రమంలో సూపర్‌వైజర్లు ఎం.రాజేశ్వరి, జ్ఞానమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, హెచ్‌ఎంలు నాగమణి పాల్గొన్నారు.

ఆధార్‌లో తప్పులు సరిచూసుకోవాలి

వీరఘట్టం: ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డులోని తప్పులు, అడ్రస్ మార్పులు, పుట్టినతేదీ, బయోమెట్రిక్ నమోదును సరిచూసుకోవాలని డీఎల్‌డీవో గోపాలకృష్ణ తెలిపారు. గురువారం వీరఘట్టం కూరాకులవీధిలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. కార్య క్రమంలో ఎంపీడీవో ఎంవీటీ సుబ్రహ్మణ్యం, సిబ్బంది, టీడీపీ పట్టణాధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎఫ్ఏ-1 పరీక్షలకు సిద్ధంకావాలి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి పాలక నారాయుడు స్పష్టం చేశారు. గురువారం రాయికురిడిలోని జీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. అనంతరం మల్లి గిరిజనబాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.కార్యక్రమంలో ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవులు పాల్గొన్నారు.

అంతర పంటల వల్ల అధిక ఆదాయం

గుమ్మలక్ష్మీపురం: అంతర పంటల వల్ల అధిక ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం విభాగ ఎన్ఎఫ్ఎఫ్ఏ హేమలత తెలిపారు. గురువారం మండలంలోని చింతలపాడులో పత్తిక జూలుమమ్మ మూడెకరాల జీడితోటలో వేరుశెనగ, కంది, చిక్కుడు, కర్రపెండలం, బెండ, బీర, జొన్న తదితర సాగుచేస్తున్న పలు అంతర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవాయ సిబ్బంది అన్నపూర్ణ, దేవీ ప్రసాద్, రైతులు కోలక సుమన్, పత్తిక భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వేగావతి కాలువలో పూడికతీత

పాచిపెంట: పెద్దగెడ్డ జలాశయానికి అనుసంధానంగా ఉన్న కర్రివలస వేగావతి ఆనకట్ట ఎడమ కాలువలో గురువారం పూడికతీత పనులు చేపట్టారు. జైకా నిధులతో జలాశయం ప్రధాన కాలువ పనులు చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కాలువలో పూడిక తీయాలన్న రైతుల కోరిక మేరకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి చొరవ చూపారు. కలెక్టర్‌కు ఆదేశించడంతో కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.4.70 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో అధికారులు పనులు ప్రారంభించారు.

వెంగళరాయ సాగర్ జలాశయ పరిధిలో...

మక్కువ: వెంగళరాయ సాగర్ జలాశయ పరిధిలోని కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలను జేసీబీతో తొలగిస్తున్నారు. ఐదేళ్ల నిర్వహణ లేక గట్లు కోతలకు గురయ్యాయి. గత ప్రభుత్వం వెంగళరాయ సాగర్‌ను పట్టించుకోకపోవడంతో కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. శంబర, ఎస్.పెద్దవలస, కొండబుచ్చింపేట, సరాయివలస గ్రామాల పరిధిలో కాలువల్లో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేస్తున్నారు.

పారదర్శకంగా ఓడీఎఫ్ సర్వే

పాలకొండ: ఓడీఎఫ్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. తుమరాడ సచివాలయ పరిధిలో ఓడీఎఫ్ సర్వేపై క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడుతున్నందున సీజనల్ జ్వరాలపై ప్రజలకు అప్రమత్తంచేయాలని, వ్యాధులు ప్రబలితే ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మరుగుదొడ్ల సర్వేను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి

పాలకొండ: పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలో అగ్నిమాపక కేంద్రం కూడలి వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, ప్రయాణికులు చెబుతున్నారు. ప్రధానంగా మలుపు వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయని అంటున్నారు. తక్షణమే రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు వితరణ

కురుపాం: విశాఖకు చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విలువైన కంప్యూటర్, ఇతర సామగ్రిని విరాళంగా అందజేసింది. గురువారం ఆసుపత్రిలో హెచ్‌ఎం తోట శంకరరావుకి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.ముర శీకృష్ణ ల్యాప్‌టాప్, ప్రింటర్, ఇన్వెర్టర్ అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ఈస్ట్ క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సొండి ఆదాం, దాతల కమిటీ అధ్యక్షుడు బెహరా దివాకర్, సింహాచలం నాయుడు, ఆకుల జగదీశ్వరరావు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉద్యాన పంటలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎం.హరికృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు కె.నిర్మల, ఎం.భూలక్ష్మి, ఎం.ఉమామహేశ్వరి, సీహెచ్ రుద్ర కోటేశ్వరరావు, ఎం.అవినాష్ పాల్గొన్నారు.

ఘనంగా గురుదత్త హోమాలు

గరుగుబిల్లి: గరుగుబిల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం జైగురుదత్త హోమాలు ఘనంగా నిర్వహించారు. వీరఘట్టానికి చెందిన యజ్ఞ యాగకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో జైగురుదత్త హోమాలు నిర్వహించినట్లు అర్చకులు నల్లకాంతం శ్రీనువాసరావు తెలిపారు. కార్యక్ర మంలో పాల్గొన్న దంపతులకు దీక్షా వస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ, ఒడిశా, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారని తెలిపారు.

వెంగళరాయ సాగర్ పరిశీలన

మక్కువ: శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయ సాగర్ జలాశయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ గురువారం పరిశీలించారు. ఈ నెల 31న రా ష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీటిని విడిచిపెట్టనున్న నేపథ్యంలో ప్రాజెక్టు స్థితిగతులు, నీటి నిల్వలను జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజాన అప్పలనాయుడును వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగునీరు విడుదల చేయడానికి కావాల్సిన సన్నాహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, ఏఈలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం పరిశుభ్రంగా మారాలి: కలెక్టర్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ప్రతి గ్రామం పరిశుభ్రంగా మారాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మహిళా శిశుసంక్షేమశాఖాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలను సమీక్షించారు. గ్రామాల్లో బయట చెత్త వేయరాదని, దీనిపై అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలు ఉంటే తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల్లో మలేరియా కేసులపై వైద్య అధికారులతో సమన్వం చేయాలన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థల సామాజిక బాధ్యతతో దోమ తెరలు పంపిణీకి ముందుకు వచ్చే అవకాశాలను పరిశీలించాలన్నారు. సీతంపేట ఐసిడిఎస్ పీవో రామలక్ష్మి చొరవను అభినందించారు. మండల ప్రత్యేక అధికారులు ఫ్రైడే డ్రైడే కార్య క్రమాలను శుక్రవారం పర్యవేక్షించాలన్నారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటివరకు 340 పంచాయతీల్లోని 951 గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ జరిగిందన్నారు. కార్య క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా ప్రణాళికాధికారి వీరరాజు పాల్గొన్నారు.

● **పార్వతీపురం టౌన్:** విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం పార్వతీపురంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తా విద్యా వారోత్సవాల్లో భాగంగా జరిగిన వివిధ కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల న్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిని పగడాలమ్మ, ఎంఈవో ప్రసాదు పాల్గొన్నారు.

●**పార్వతీపురం రూరల్:** మండలంలోని అడ్డాపుశీల సమీపంలో కాశీవిశ్వేశ్వరస్వామిని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో వేద మం త్రాలతో శా స్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈసందర్భంగా స్వయం భూగా వెలిసిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ విశిష్టత, పురాతన చరి త్రను పురోహితులు కృష్ణచంద్రశర్మ కలెక్టర్‌కు వివరించారు.కాగా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు రాష్ట్ర నిర్వాసితుల సంఘం నాయకులు బంటుదాసు కలిశారు. ఈ సందర్భంగా తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు.



పార్వతీపురంటౌన్: ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రికార్డుల భద్రతకు పకడ్బందీ చర్యలు

● *తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు*

జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల భద్రతపై యం త్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. ఇటీవల అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు ధ్వంసమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డుల ఉంచే గదులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి ఆదేశించడంతో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు రికార్డులను పరిశీలించి అవసరమైన భద్రత చేపట్టారు.

గరుగుబిల్లి: గరుగుబిల్లిలోని తహసీల్దార్‌కార్యాలయం పరిధిలోని రికార్డును గురువారం అధికారులు పరిశీలించి భద్రత చేపట్టారు. ప్రతిరోజూ రికార్డు రూము పరిశీలనకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. కొద్దిరోజుల్లో కార్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకుచర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ కె.జయ, డీటీ పి.సత్యలక్ష్మీకుమార్ తెలిపారు. రోజువారీ సీసీ కెమెరా ఫుటేజీలతోపాటువివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు.

వీరఘట్టం: రికార్డులను భద్రంగా ఉంచుతున్నామని తహసీల్దార్ కె.జయప్రకాష్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యా లయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ రికార్డులు భద్రపరచడానికి చర్యలుచేపట్టారు. ఈ మ ఏరకు అన్ని రికార్డులు కార్యాలయం గదిలోని అరల్లో అమర్చేందుకు ఏర్పాటు చేస్తున్నామనిన పోలీసులకు కూడా సమాచారం అందించామని తహసీల్దార్ తెలిపారు.

గోతుల్లో దిగబడిన వాహనాలు

● *గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం*

పార్వతీపురం -కూనేరు అంతర్రాష్ట్ర రహదారి, అలికాం-బత్తిలి రహదారిలో బుధవారం సాయంత్రం, అర్ధరాత్రి వాహనాలు గోతుల్లో దిగబడిపోయాయి. దీంతో గంటల తరబడి ఆయా మార్గాల్లో నిలిచిపోయాయి. గురువారం ఉదయం ట్రాఫిక్ స్తంభించిపోయింది.

కొమరాడ: పార్వతీపురం - కూనేరు అంతర్ రాష్ట్ర రహదారిపై విశాఖప ట్నం వైపు నుంచి రాయగడ వెళ్తున్న లారీ బుధవారం అర్ధరాత్రి రెండు గం టల ప్రాంతంలో గుమడ దగ్గర అంతర్ రాష్ట్ర రహదారిపై గోతిలో దిగబడి పోయింది. దీంతో భారీ వాహనాలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. కొమరాడ ఎస్ఐ నీల కంఠం ఆధ్వర్యంలో పోలీసులు గోతిలో దిగబడిన లారీని బయటకు తీయిం చి రహదారిపై నిలిచిన వాహనాలను పంపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

● **భామిని:** బిల్లుమడ, గురండి సమీపంలో అలికాం-బత్తిలి రహదారిలో గురువారం మళ్లీ టిప్పర్ గుంతలో దిగబడింది. దీనితో మూడు గంటలకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బుధవారం సాయంత్రం లారీ గుంతలోకి దిగగా యంత్రంతో బయటకు తీశారు. ఆ గుంతలో గ్రావెల్స్ సర్దు తుండగా పక్క నుంచి వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు. గుంతలో ఇరుక్కుపోయి బోల్తా పడే సమయంలో యంత్రం ఆపరేటర్ టిప్పర్‌ను నిలుపుదల చేయించాడు. దీనితో పెద్ద ప్రమాదం తప్పింది. మరో యంత్రంతో దాన్ని బయటకు తీశారు. బత్తిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఏఎస్ఐ కాంతారావు ఆధ్వర్యంలో అక్కడ గ్రావెల్‌తో చదును చేసి యథావిధిగా వాహనాలకు దారి ఇచ్చారు.



కొమరాడ:అంతర్రాష్ట్ర రహదారిలో బారులుదీరిన భారీ వాహనాలు



భామిని: అలికాం-బత్తిలి రహదారిలో స్తంభించిన ట్రాఫిక్

పాఠశాలల పరిస్థితులపై నివేదికలు



కారివలసలో పశువుల శాలలో తరగతులు నిర్వహిస్తుండడంపై పరిశీలిస్తున్న ఎంఈవో

గరుగుబిల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితుపై అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో పశువుల శాలలో విద్యా బోధన శీర్షికన కథనం ప్రచురితమయ్యింది. దీంతో స్పందించిన ఎంఈవో ఎన్.నాగభూషణరావు కారివలస పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు చర్యలు నిమిత్తం జిల్లా కలెక్టర్, డీఈవోకు నివేదికలు అందిస్తున్నామన్నారు. ఆయన వెంట చిలకాం ఉపాధ్యాయులు కె.రామ్‌మోహన్‌రావు ఉన్నారు.

మురుగునీటి మళ్లింపునకు చర్యలు



ప్రధాన రహదారిలోని కాలువల పరిస్థితిని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: ఎట్టకేలకు మున్సిపల్ ప్రజారోగ్య శాఖాధికారులు స్పందించారు. ఈనెల 20న 'ఆంధ్రజ్యోతి'లో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో వరదనీటితో పాటు మురుగునీరు నిలిచిపోవడంపై 'వర్షం కురిస్తే.. ముంపే' శీర్షికన కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. గురువారం ప్రధాన రహదారిలో గల కాలువల పరిస్థితిని పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పూడికలు తొలగిస్తామన్నారు.

పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలి

● *అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే విజయచంద్ర*

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: దళితులను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ దళితులను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తే ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా శాసనసభ, లోక్‌సభలో ఉన్న మాదిగ సామాజిక వర్గం ప్రజా ప్రతినిధులు ఆత్మీయ కలయికలో ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయచం ద్రను ఘనంగా సన్మానించారు.



సామాజిక వర్గం ఎమ్మెల్యేలతో పాటు పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

● *రాష్ట్ర గిరిజన శాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి*

పార్వతీపురం ఆంధ్రజ్యోతి/సాలూరు: సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని రాష్ట్ర గిరిజనశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీఇచ్చారు.ఈ మేరకు గురువారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన తన నియోజకవర్గ సమస్యలు పరిష్కారానికి సహకరించాలని సంధ్యారాణిని కోరారు. రెండు శాఖలకు చెందిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.



సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటనాయుడు

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖామం త్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. గురువారం అమరావతిలో తన కార్యాలయంలో ట్రైబుల్ వెల్ఫేర్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

కొమరాడ: తోటపల్లి ప్రాజెక్టు వల్ల నిర్వాసితులు సమస్యలను పరిష్కరించాలని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ రైతువిభాగ అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు కోరారు. ఈ మేరకు గురువారం మంత్రి గుమ్మడి సంధ్యారాణిని వెలగపూడి సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సమస్యలను ఆమెకు వివరించారు. నిర్వాసితులు, జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో గొట్టాపు త్రినాధం, నందివాడ కృష్ణబాబు, తదితరులు ఉన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

కురుపాం: రాష్ట్రంలో విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత మంత్రి లోకేష్‌ను ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బంకులు జోగినాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఏపీటీఎఫ్ నాయకులు విద్యా రంగ సమస్యలపై విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ 117 జీవో రద్దు, స్టేట్ సిలబస్‌ను తెలుగు భాషలో బోధించడం, అమ్మకు వందనం కార్యక్రమం నుంచి ప్రైవేటు, కార్పొరేట్ విద్యార్థులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.ఎస్.సుబ్బరావు, పల్ల మోహనరావు, జీవీ శేషగిరి, డి.రామకృష్ణ, కొండేటి శంకరరావు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు భద్రత కల్పించాలి

మక్కువ: ఆడపిల్లలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. మండల కేంద్రం మక్కువలో విద్యార్థులతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీలకు రక్షణ కల్పించే చట్టాలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, మద్యం పూర్తి స్థాయిలో నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ హరికృష్ణ, విద్యారులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తత అవసరం

మక్కువ: విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ సిబ్బంది విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యలపై చర్చించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జీసీసీ డీఎం

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ఎస్పీ మాధవరావును జీసీసీ డీఎం మహేం ద్ర గురువారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా జీసీసీ ద్వారా గిరిజనులకు అందిస్తున్న సేవలు గురించి వివరించారు.

సీఎం దృష్టికి పెన్షనర్ల సమస్యలు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జిల్లా విశాంత ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు, రాష్ట్ర పెన్షనర్ల పార్టీ ఉపాధ్యక్షుడు డీజీ ప్రసాద్ సన్మానించారు. విజయవాడలో ఆంధ్రా పెన్షనర్ల పార్టీ అధ్యక్షుడు సుబ్బరాజన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యలు గూర్చి సీఎంకు వివరించినట్టు ప్రసాద్ ఆంధ్రజ్యోతికి గురువారం రా త్రి చెప్పారు. కార్య క్రమంలో ప్రధాన కార్యదర్శి పెద్దన్‌గౌడ్‌తో పాటు రామస్వామి, మున్నేయ్ ఉన్నారు.

సీఆర్పీలను రెన్యువల్ చేయాలి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్పీలను రెన్యువల్ చేయాలని చేస్తున్న నిరాహారదీక్షలు గురువారం మూడోరోజుకు చేరింది. అధికారులు నుంచి స్పందన కరువైందని, ఈ సమస్యలపై కలెక్టర్‌కు కూడా తెలియజేశామని చెప్పారు.కొత్తగా వచ్చిన పీవో స్పందించి 47 మందిని రెన్యువల్ చేయాలన్నా రు. లేకపోతే సోమవారం చలో ఐటీడీఏ కార్య క్రమాన్ని చేపడతామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, మురళీ, మోహన్‌రావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భామిని: మండలంలోని శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లతో పాటు అక్కడక్కడ మొరాయించిన స్థలంలో మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మతులు చేపడుతున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం: వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. గురువారం వీరఘట్టం పీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్షించారు. కార్య క్రమంలో శాంతికుమారి, ఆదిలక్ష్మి, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

గోముఖికి వరద ఉధృతి

మక్కువ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు శంబర గ్రామ సమీపంలో ఉన్న గోముఖి రిజర్వాయర్‌లోకి వరదనీరు చేరడంతో గురువారం 300 క్యూసెక్కుల నీటిని నదుల్లోకి ఇరిగేషన్ అధికారులు విడిచిపెట్టారు. ఫ్లో ఎక్కువ అయితే మరికొన్ని క్యూసెక్కుల నీటిని విడిచిపెడతామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నదీ పరీవాహక ప్రాంత ప్రజలను అ ప్రమత్తం చేసినట్టు ఏఈ ప్రశాంత్ తెలిపారు.

మజ్జిగౌరి అమ్మవారి హుండీ లెక్కింపు

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం ఆలయ ట్రస్టీ చేపట్టింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు కార్యక్రమం రాత్రి పది గంటల వరకు కొనసాగింది. అమ్మవారికి భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు రూ.99,15, 422, 53 గ్రాముల బంగారం 2 కిలోల 390 గ్రాముల వెండి ఆదాయం సమకూరినట్లు ఆలయ ట్రస్టీ రాయసింగ్ బిడిక తెలిపారు.ఈ ఆదాయాన్ని యూనియన్ బ్యాంకులో జమచేస్తునట్లు ఆయన పేర్కొన్నారు.లెక్కింపు కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాలాజీ వెంకటేశ్వర భక్తసమాజం మహిళలు పాల్గొన్నారు.

47 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: పద్మాపూర్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారులో తరలిస్తున్న 47 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గంజాయిని తరలిస్తున్న సమంతో మాఝిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆయన వద్దనుంచి గంజాయితో పాటు సెల్‌ఫోన్ కారును స్వాధీనం చేసుకున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

రాయగడ: న్యూకాలనీ సత్యసాయబాబా మందిరంలో జరిగిన చోరీకేసును పోలీసులు ఛేదించారు.ఎస్‌డీపీవో ఆర్.సేనాపతి కథనం మేరకు.. ఈ నెల 12 మందిరంలో 5 కిలోల చోరీకి గురైనట్లు శివకుమార్ అగర్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నయాఘడ్ జిల్లా ఇటామటి పోలీసుస్టేషన్ పరిధి నాగపూర్ గ్రామానికి చెందిన ఘనశ్యామ్‌దాస్, ఆలియాస్ ప్రకాష్‌కుమార్‌దాస్‌ను అదుపులోనికి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి వెండి ఫ్రేమ్‌ను వెండికడ్డీలుగా మార్చిన సొత్తును స్వాధీనం చేసుకుని ఆలయ భక్తసమాజానికి అందజేశారు.

తప్పుడు ఆరోపణలు చేయవద్దు

● *నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణరావు*

సాలూరు: గిరిజనేతరుడైన పాలక రంజిత్ కుమార్, గిరిజనులు, గిరిజన మంత్రిపైన తప్పుడు ఆరోపణలుచేస్తే సహించేది లేదని టీడీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోట్ల లక్ష్మణరావు తెలిపారు. గురువారం సాలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014-19లో టీడీపీ ప్రభుత్వ హాయంలోనే ఏకలవ్య పాఠశాలలు వచ్చాయని, రాష్ట్రంలో 27 ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఏకలవ్య పాఠశాలల్లో మొత్తంగా గిరిజనులు మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. రూల్ ఆఫ్ రోస్టర్ ప్రాతిపదికన ఒకటి రెండు శాతం గిరిజనేతరులు ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ హయంలో ఏకలవ్య పాఠశాలల్లో ఎటువంటి వసతులు మెరుగుపడలేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో గత నాయకులు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన కేవలం నెల రోజుల్లోనే వసతి గృహ విద్యార్థులకు రగ్గులు, దుప్పట్లు, కంచాలు, పెట్టెలు, గ్లాసులుతో పాటు సీజనల్ వ్యాధులకు సంబంధించి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు లేని పోని అవాస్తవ ఆరోపనలు చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. సమావేశంలో గిరిజన నాయకులు దొర లక్ష్మణ, సంపంగిపాడు సర్పంచ్ చంద్రయ్య, డిప్పల కృష్ణ, పండయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.